


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 05 | జూలై | 2026 | పేజీలు: 08













# అత్యాధునికం అతిపెద్ద "బండా"గారం

## సాంకేతికతలో బండారు ఆగ్రోటెక్ విప్లవం

రైతు సంక్షేమంగా ఉంటే రైస్ మిల్లులు క్షేమం

రూ.150 కోట్లతో బండారు ఆగ్రోటెక్ షురూ

రైస్ మిల్ చరిత్రలో విప్లవాత్మకం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం నిల్వ చేసేందుకు ఆధునిక సైలోస్ నిర్మించి మహిళా సంఘాల ద్వారా నిర్వహణ చేపట్టనున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి ..మిగతా 2లో

# ప్రగతి దిశగా అడుగులు

**సమగ్రాభివృద్ధి లక్ష్యం**

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**గద్వాల, అక్షిత న్యూస్ :** హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ..మిగతా 2లో



# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో: పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను చైతన్యపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయం, ఎరువుల లభ్యత, ఫార్మర్ రిజిస్ట్రీ, కాలానుగుణ వ్యాధుల నివారణ తదితర అంశాలపై ..మిగతా 2లో

# ప్రజల దరికే ప్రగతి ఫలాలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని ..మిగతా 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

ఆదివారం |05| జూలై | 2026

## ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి



**మొదటి పేజీ తరువాయి...**

సమీక్ష నిర్వహించగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2026--27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధనకు జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయడంతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వ్యవసాయానికి అవసరమైన యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎరువుల అక్రమ రవాణా, పక్కదారి పట్టించడం వంటి చర్యలను కఠినంగా అరికట్టాలని, జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం నమోదుతో మొదటి స్థానంలో ఉందని పేర్కొంటూ, ఈ పురోగతిని కొనసాగించాలని అధికారులను కోరారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా వైద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలు, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల దరికే ప్రగతి ఫలాలు



**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలో గల ఈ.వి.ఎం. గోదాము వద్ద భద్రత చర్యలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వి.వి. పాట్ల భద్రతకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునికం అతిపెద్ద "బండా"గారం





**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణ శివారులో రైస్ మిల్లర్ బండారు కుశలయ్య నిర్మించిన బండారు ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ రైస్ మిల్లును ప్రారంభించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లులు, గోదాముల అధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని ఆయన తెలిపారు. బియ్యం విదేశాలకు ఎగుమతి విధానాన్ని సరళీకరించనున్నట్టు తెలిపారు. రైస్ మిల్లుల వల్ల రైతులకు మేలు జరగాలన్నారు. ఎల్ నీనో ప్రభావం రాష్ట్రంలో ఉందని వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఆయన రైతులకు సలహా ఇచ్చారు. కస్టమ్ రైస్ మిల్లింగ్ (సిఎంఆర్) లోని లోపాలు సరిదిద్దనున్నట్టు తెలిపారు. మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ బియ్యం చెల్లిస్తున్నారన్నారు. రబీ 81 లక్షలు టన్నులు రైతుల నుండి కొనుగోలు చేసి 19,300 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. వానాకాలం, రబీ సీజన్లో 150 లక్షల టన్నులు ధాన్యం రైతుల నుండి కొన్నామన్నారు. రెండున్నరేళ్లు ఎస్ఎల్బిసి టన్నల్ పూర్తి తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేస్తామన్నారు. 150 కోట్లతో ఆధునిక రైస్ మిల్లు నిర్మించిన బండారు కుశలయ్యను శుభాకాంక్షలు తెలిపారు. రైస్ మిల్లులు రైతు సంక్షేమంగా ఉంటే రైస్ మిల్లులు క్షేమంగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్నడూ లేని విధంగా రైతుల ధాన్యం కొనుగోలు చేశారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. మిల్లుల వల్ల రైతుకు మేలు పేచీలు పెట్టకుండా ధాన్యం కొనాలని ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ అన్నారు. మిర్యాలగూడ డివిజన్ వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో బండారు ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ రైస్ మిల్లును ప్రారంభించిన అనంతరం ఆయన కార్యక్రమంలో విప్ వేముల వీరేశం, డీసీసీ పున్నా కైలాష్ నేత, మునిసిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, ఆలిండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్ష, కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, గుండా మల్లయ్య, మిట్టపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.



# ప్రగతి దిశగా అడుగులు



**మొదటి పేజీ తరువాయి...**

వ్యవసాయం, తాగునీటి సరఫరా,సాగునీటి నిర్వహణ, వైద్య ఆరోగ్య సేవలు, విద్యా రంగం,ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రానున్న ఆరు నెలల్లో ప్రతి జిల్లాలో అభివృద్ధిలో గణనీయమైన మార్పు కనిపించేలా అధికారులు లక్ష్యబద్ధ కార్యాచరణతో పని చేయాలన్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించే విధంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని సంజయ్ జాజు తెలిపారు.ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి దోహదపడే వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణాత్మక కార్యక్రమాలతో అధికారులు ముందుకు రావాలని ఆయన అన్నారు. త్వరలో జిల్లాలను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలును స్వయంగా పరిశీలిస్తానని ఆయన తెలిపారు.జిల్లాల్లో నమోదవుతున్న వర్షపాత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

వర్షాభావం లేదా అధిక వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కాంటింజెన్సీ క్రాప్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు,వైద్య సిబ్బంది, చికిత్సా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల పోషకాహారాభివృద్ధి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు.వ్యవసాయం, తాగునీటి సరఫరా, సాగునీరు, వైద్య ఆరోగ్య సేవలు, విద్య, వర్షాకాల పరిస్థితులతో పాటు ఇతర శాఖల పురోగతిపై జిల్లాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను ఆయన తెలిపారు. గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సేవలు, తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నివారణ,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మధుమోహన్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,సంబంధిత శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతోనే

# ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి

**అప్పుల పాలవద్దు.. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ పీడీ, కుభీర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి**

**పార్డి (బి)లో లబ్ధిదారు షేక్ గఫూర్ ఉద్దీన్‌ను అభినందించిన అధికారి**



**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 4:--** రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.5 లక్షల నిధులతోనే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని, అదనపు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవద్దని హౌసింగ్ పీడీ, కుభీర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శనివారం కుభీర్ మండలంలోని పార్డి (బి), చాత, డోదర్నా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, పురోగతిపై ఆరా తీసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్డి (బి) గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు షేక్ గఫూర్ ఉద్దీన్ సీనియర్ జర్నలిస్ట్ నివాసాన్ని సందర్శించిన శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వం అందిస్తున్న నిధులతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నందుకు ఆయనను అభినందించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని, అనవసరంగా అధిక ఖర్చులు చేసి అప్పుల పాలుకాకుండా ఇతర లబ్ధిదారులు కూడా ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుని నాణ్యమైన ఇంటిని నిర్మించుకోవాలని, అవసరానికి మించి ఖర్చు చేయవద్దని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం పార్డి (బి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకుని, గ్రామంలోని ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. తదుపరి చాత ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం డోదర్నా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ, లేదీ స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, స్థానిక సర్పంచులు ప్రవీణ్ కుమార్, రజిత, దేవేందర్, బిక్కులాల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయం

**: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 4:** అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని, మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరయోధుల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి అని అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం సాధ్యమని విశ్వసించి, అత్యల్ప వనరులతో బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన ధైర్యవంతుడని కొనియాడారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. రెండేళ్ల పాటు బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన గొప్ప వీరుడు అల్లూరి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, నవీన్ గౌడ్, హరినాథ్ రెడ్డి, గడియారం రామకృష్ణ, కుమార్, సందీప్ యాదవ్, శేఖర్ గౌడ్, పూస రమేష్, జైపాల్, మధు వర్మ, డీవీఎస్ఎస్ఎన్ రాజు, జయారామరాజు, రామకృష్ణ, వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఎస్సీ సాధన మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**యాదాద్రి భువనగిరి/అక్షిత బ్యూరో:** జులై 06న హైదరాబాదులోని బైరమల్ గూడ కేకే గార్డెన్స్ లో జరగనున్న చాకలి ఎస్సీ సాధన సమితి 9వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి రజక కులస్తులకు పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలిమినేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఎస్సీ సాధన సమితి 9వ వార్షికోత్సవ మహాసభ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆవిష్కరించారు ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం కోసం రజక ఫెడరేషన్ కు రూ 9 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రమాదాల్లో చనిపోయిన వారికి రూ 5 లక్షల బీమా అందించాలని ఆమె కోరారు భారతదేశంలో 18 రాష్ట్రాలలో మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో చాకలి కులస్తులు ఎస్సీ జాబితాలో ఉన్నారని అదేవిధంగా తెలంగాణలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సట్టు నాగయ్య నాయకులు అవనగంటి మల్లేశం బాలరాజు లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

## ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్న ప్రభుత్వం..

**డా. దాస్యం అభినవ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :**వరంగల్ పశ్చిమ నియోజకవర్గం భద్రకాళి అమ్మవారి ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆలయ శుద్ధి కార్యక్రమానికి వెళ్లకుండా 60వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ ను పోలీసులు శనివారం ఉదయం ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకాకుండా నాయకులను నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

## తాజ్ పూర్‌లో అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** భువనగిరి మండలంలోని తాజ్ పూర్ గ్రామంలో అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాటం తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా తాజ్ పూర్ లో ఆ మహనీయున్ని స్మరించు కుంటూ తాజ్ పూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో వారి విగ్రహానికి గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్ కురుమ సంఘం నాయకులు, కుల పెద్దలు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దివంగత మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు



**కరీంనగర్ అక్షిత న్యూస్** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని దివంగత కొనిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కొనిజేటి రోశయ్య ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆదర్శ రాజకీయ నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన పట్ల ఆయన చూపిన నిబద్ధత భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొయినుద్దీన్ వేణుమాధవ్ అసిస్టెంట్ కమిషనర్ రాజ్ మనోహర్ కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# ధిక్కార స్వరం దొడ్డి కొమురయ్య

**స్ఫూర్తిదాయకం దొడ్డి కొమరయ్య పోరాటం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,నిజాం నవాబులకు ఎదురొడ్డి పోరాడిన ధిక్కార స్వరం, దొడ్డి కొమురయ్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 80 వ వర్ధంతి వేడుకలు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి కుమార్ పాల్గొని ముందుగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో నిజాం పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా దేవరుప్పల మండలం కలవెండి గ్రామంలో జన్మించి నిజాం రాజరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడు కొమరయ్య అని గుర్తు చేశారు. దొడ్డి కొమరయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని సూచించారు. ఆనాటి అమరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, గోలి లావణ్య, గంప శ్రావణి, ఉల్లేరావు బన్నీ, పీక రవి, పోతుగంటి స్వప్న, సుభద్ర, శ్రీలత, మట్టి నాగమణి, గణేష్, దొగ్గల చరణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా మెకానిక్‌ల దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** పట్టణంలోని ద్విచక్ర వాహన మెకానిక్ సత్తుపల్లి మోటర్ సైకిల్ మెకానికల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు భాస్కర, కార్యదర్శుల బాజీ ఆధ్వర్యంలో జెండాను ఎగరవేశారు. అనంతరం కేక్ కట్ చేసి,మిఠాయిలు పంపిణీ చేసుకొని ఒకరికొకరు మెకానిక్ లు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం ఏకతాటిపై ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని, ప్రజా ప్రతినిధుల అండదండలతో ఆటోనగర్ ఏర్పాటు చేసుకుందామని, తారతమ్యాలు లేకుండా ఏకతాటిపై మన యూనియన్ నడుపుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో హకీమ్,శ్రీను,ప్రసాద్,మురళి, శివ,మీరా,రవి,ముస్తఫా, శ్రీకాంత్,అజార్, కమల్ నాయక్, శేఖర్,రామ కృష్ణ,రహీం,చక్రి, నభి, సాయి,అబ్దుల్లా,పూరేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పల్లెర్ల రవి- శంకరమ్మ దంప తుల కుమారుడైన పల్లెర్ల నితిన్ (19) అనారోగ్యం కారణంగా మరణించడం జరిగింది. కొద్ది సంవత్సరాల కిందట తండ్రి కూడా మరణించాడు. నిరుపేద కుటుంబం కావడంతో దయార్ద్ర హృదయంతో పులిగిల్ల గ్రామ మాజీ సర్పంచ్ జక్కా వెంకట్ రెడ్డి 5000 రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బందారు ఎల్లయ్య,మన్నెం వెంకట్ రెడ్డి, బందారు యాదయ్య, మొగిలి పాక మోహన్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి

**పూలమాల వేసి నివాళులు అర్పించిన కలెక్టర్ డా. సత్య శారద**




**వరంగల్, అక్షిత బ్యూరో:** అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిబిసిడిఓ పుష్పలత, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొని అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించారు.

## దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం టిపియుఎస్**

**లింగాల మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి తహశీల్దార్ గారికి వినతి పత్రం**




**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి** విద్యారంగా మరియు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వివిధ దశల ఉద్యమ కార్యాచరణ మొదటి దశ ఈనెల 4వ తేదీన మండల స్థాయిలో ఆందోళన,14 వ తేదీన జిల్లాస్థాయిలో ధర్నా, 24వ తేదీన రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమంలో భాగంగా ఈరోజు లింగాల మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి తహశీల్దార్ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

ప్రధాన డిమాండ్లు

1. జూలై 2026 తో పిఆర్సి గడువు అయిపోయి 3 సంవత్సరాలు గడిచినది. కావున తక్షణమే పి ఆర్ సి రిపోర్ట్ తెప్పించుకొని పి ఆర్ సి ని అమలు చేయాలి.
2. పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను విడుదల చేయాలి
3. మేనిఫెస్టోలో సూచించిన విధంగా సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలి.
4. అన్ని రకాల పెండింగ్ బిల్స్ లను విడుదల చేయాలి
5. 190 జీవోను అమలు చేయాలి.
6. కేజీబీవీ మరియు ఎస్ ఎస్ ఏ ఉద్యోగుల, గురుకులాల మరియు ఆశ్రమ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి.
7. పాఠశాలలలో మౌలిక వసతులను కల్పించాలి.
8. సిపిఎస్ ఉద్యోగుల డీఏ ఏరియర్స్ ఇన్స్టాల్మెంట్స్ ను విడుదల చేయాలి

ఇలా పలు అంశాల పరిష్కారం కోరుతూ తహశీల్దార్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరింప చేసే విధంగా వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి పి యు ఎస్ టి పి మండల అధ్యక్షులు ఈ సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జేపీసీ చైర్మన్ వెంకటేశ్వర్ల శర్మ , శ్రీనివాస్ రెడ్డి, ధరంసింగ్, శేఖర్, మంజులత, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

**రేషన్ షాపుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి**





**మానకొండూర్ అక్షిత న్యూస్** ప్రజలకు నిత్యవసర వస్తువుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శంగా పనిచేసేలా ప్రజాపంపిణీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మానకొండూర్ మండలం మానకొండూర్, అన్నారం, పచ్చునూరు గ్రామాల్లో చౌకధరల దుకాణాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి రేషన్ సరుకులు అందించడమే కాకుండా సరకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకున్నదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాల ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు.రేషన్ దుకాణాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని సంబంధిత డీలర్లకు సూచించారు. ప్రజలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది ఓదెలు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి నరేష్, బందెల మహేందర్, బి.మల్లయ్యగౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగులో సరికొత్త పరిరక్షణ, బోనస్ ఆదాయం

**పర్యావరణాన్ని కాపాడితే నేరుగా రైతు ఖాతాల్లోకే కార్బన్ క్రెడిట్స్ నగదు బదిలీ**

**రైతు వేదికలో దేశ రాజధాని వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రత్యక్ష అవగాహన సదస్సు**







**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సాంప్రదాయ వరి సాగులో పెట్టుబడులు నానాటికీ పెరిగిపోతూ, సాగునీటి లభ్యత తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో సత్తుపల్లి మండల వరి రైతులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై మార్గదర్శకత్వం లభించింది. చేంజ్ అలయన్స్, డి బి ఆర్ సి, మరియు వరాహ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కాకర్లపల్లి రైతు వేదికలో ఒక భారీ అవగాహన సదస్సును అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీ నుండి విచ్చేసిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొని రైతులకు ప్రత్యక్షంగా దిశానిర్దేశం చేశారు. రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ లాభసాటి వ్యవసాయంతో అభివృద్ధి చెందాలని కోరారు.

**వరి సాగులో ఏ డబ్ల్యు డి విప్లవం**

ప్రస్తుత రోజుల్లో నీటి కొరత, విపరీతమైన విద్యుత్ ఛార్జీల భారం రైతులకు పెద్ద సవాలుగా మారాయి. వీటికి ధీటైన పరిష్కారంగా గ్రీన్ ప్యాడీ ప్రాజెక్ట్ లో భాగంగా ప్రవేశపెట్టిన తడి-పొడి సాగు పద్ధతి వరి సాగులో సరికొత్త మార్పుకు నాంది పలకనుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ పద్ధతిని అవలంబించడం ద్వారా వరి దిగుబడి ఏమాత్రం తగ్గకుండానే, అద్భుతమైన ప్రయోజనాలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ పద్ధతి వలన 30 శాతం నీటి పొదుపు సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఈ నూతన తడి-పొడి సాగు విధానంలో వరి సాగుకు అవసరమయ్యే నీటి వినియోగం దాదాపు 30 శాతం వరకు తగ్గుతుంది. సాగు నీటి వినియోగం తగ్గడం వల్ల మోటార్ల వాడకం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల కరెంట్ బిల్లులు ఆదా అవ్వడమే కాకుండా, మోటార్ల అరుగుదల ఖర్చులు తగ్గి పెట్టుబడి భారం తగ్గుతుంది.

**స్థిరమైన నాణ్యమైన దిగుబడి**

శాస్త్రీయ పద్ధతుల ద్వారా తక్కువ నీటితోనే నాణ్యమైన, స్థిరమైన అత్యధిక వరి దిగుబడిని సాధించవచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు. రైతులకు లభించనున్న కార్బన్ క్రెడిట్స్ బోనస్! ఈ ప్రాజెక్టులోని అత్యంత ఆకర్షణీయమైన అంశమన్నారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన అదనపు ఆదాయం. తడి-పొడి సాగు పద్ధతి ద్వారా భూమి నుండి వాతావరణంలోకి విడుదలయ్యే ప్రమాదకర మిథేన్ ఉద్గారాలను 48 శాతం వరకు తగ్గించవచ్చు. ఇలా పర్యావరణాన్ని కాపాడుతూ వరి పండించే రైతులకు 'కార్బన్ క్రెడిట్స్' రూపంలో ప్రభుత్వం మరియు అంతర్జాతీయ సంస్థల నుండి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే అదనపు నగదు ప్రోత్సాహకం (బోనస్ ఆదాయం) అందుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. సత్తుపల్లి మండలంలోని వరి రైతులందరూ, ముఖ్యంగా ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలనుకునే ప్రతీ ఒక్క రైతు సోదరుడు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహక సంస్థలైన చేంజ్ అలయన్స్, డి.వి.ఆర్.సి మరియు వరాహ ప్రతినిధులు ఢిల్లీ వ్యవసాయ శాస్త్రవేత్త బాసబ్, ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, బాబ్జి, పిలుపునిచ్చారు. రైతులు ఆధునిక సాంకేతికతను తెలుసుకొని, లాభాల బాట పట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష, కాకరపల్లి పంచాయితీ సర్పంచ్ పొదిలి. మహేశ్వరరావు మండల కో ఆర్డినేటర్ మహేశ్వర రావు, రవిబాబు , రైతులు ఈ కార్యక్రమంలోపాల్గొని,శాస్త్రవేత్తలను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.


# ప్రతి ఒక్కరు ఓటు హక్కును కాపాడుకోవాలి



**వరంగల్, అక్షిత బ్యూరో:** ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఆయుధమని వ్యవస్థను బలోపేతం చేయాలంటే ప్రతి పౌరుడికి ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పై ప్రజలకు ప్రత్యేకమైన అవగాహన నిర్వహించారు. 242 బూత్ లో బి , ఎల్, ఓ లతో కలిసి ఇంటి ఇంటికి ఎస్ ఐ ఆర్ ఎనిమిరేషన్ ఫార్మ్స్ ను ఇస్తూ అవగాహన కలిపిస్తున్నారు. 18 సం "నిండిన ప్రతి ఒక్కరు ఓట్ ను నమోదు చేసుకోవాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే బి ఎల్ ఓ, బి ఎల్ ఏ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమం లో బి ఎల్ ఏ మట్టెడ అనిల్, ఓబీసీ జిల్లా కో ఆర్డినేటర్ కల్లూరి పవన్, నాయకులు ఎం డి మెహబూబ్, బి ఎల్ ఓ తదితరులు పాల్గొన్నారు

# రైతుల సేవే విండోల లక్ష్యం కావాలి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్ అక్షిత న్యూస్** రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మానకొండూర్ సింగిల్ విండో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విండో చైర్మన్ గా నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి,కత్తెర్ల రాజు,మంగురపు నర్సవ్వ,సుధగోని తిరుపతిగౌడ్, గాలి మొగిలి,కొట్టె అంజిరెడ్డి, ఎం.రామకృష్ణ,దూలం దేవేంద్ర, కొలిపాక మొగిలి, బుర్ర శ్రీకాంత్, కుర్ర వెంకటస్వామి, ఏగోళపు శ్రీనివాస్ గౌడ్ ల చేత జిల్లా సహకార శాఖ సీనియర్ రిజిస్ట్రార్ శైలజ ప్రమాణం చేయించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతన్నలకు అండగా నిలవాలని, సింగిల్ విండో వ్యవస్థ ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, పంటల బీమా వంటి సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తున్నదని, రైతు భరోసా కింద ఎకరానికి ఏటా రూ.12,000 పెట్టుబడి సాయం, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేస్తున్నదని, అర్హులైన ప్రతి రైతుకూ అందేలా సింగిల్ విండోలు కీలక పాత్ర పోషించాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా పని చేయాలని ఎమ్మెల్యే హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

# దొడ్డి కొమరయ్య ఆశయాల సాధనకు కృషి చేస్తాం

**ఏఐఎస్ఎఫ్**

**లింగాల ప్రభుత్వ పాఠశాలలో దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి**

**విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి**

**ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి** లింగాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య భూస్వామ్య దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, సమానత్వం, సామాజిక న్యాయం, పేద ప్రజల హక్కుల కోసం చేసిన త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా దొడ్డి కొమరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

అనంతరం పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం నాణ్యత అత్యంత దారుణంగా ఉందని, ప్రతిరోజూ సరైన కూరలు లేకుండా, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని, సరిగా ఉడకని అన్నం, పలుచని చారు మాత్రమే పెడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రెండు గుడ్లు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై స్పందించిన ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బిల్లులు రావడం లేదనే కారణంతో విద్యార్థులకు నాసిరకం భోజనం పెట్టడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం కూరలు, గుడ్లు, ఇతర పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సందర్భంగా ఫుడ్ ఇన్‌చార్జి నరసింహులు విద్యార్థి నాయకుల పట్ల అత్యంత దురుసుగా, అసభ్యకర పదజాలంతో మాట్లాడిన ఘటనను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండించింది. ప్రజా సేవలో ఉన్న ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో విద్యార్థి నాయకులను అవమానించే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొంది. ఇటువంటి ప్రవర్తన ప్రభుత్వ ఉద్యోగులకు తగదని, దీనిపై లింగాల మండల విద్యాశాఖాధికారి వెంటనే విచారణ జరిపి ఫుడ్ ఇన్‌చార్జి నరసింహులుపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మధు తరుణ్ చిన్న ప్రవీణ్ లక్ష్మీప్రసన్న శిల్ప శృతి మరియు విద్యార్థులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన అవసరం

**బి. రాజేశ్వర్ జూనియర్ సివిల్ జడ్జి**



**కరీంనగర్ అక్షిత బ్యూరో** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామము లోని మహాత్మ జ్యోతి బా పూలే ,బాలికల కళాశాల లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కే రాణి ఆదేశాలకు అనుగుణంగా జూనియర్ సివిల్ జడ్జిలు బానోత్ రాజేశ్వర్, దామెర్ల ప్రీతి కళాశాలను సందర్శించి భారత రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కులు మరియు విధులు గురించి తెలియజేశారు, సమాజంలో సమానత్వం గురించి మరియు మనల్ని మనం రక్షించుకోవడానికి ఏర్పాటు చేసుకున్నదే చట్టము అని ఆ చట్టం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థి దశలో ముఖ్యమైనది అని తెలియజేశారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా కళాశాల లో అందుతున్న సౌకర్యాల గురించి తనిఖీ చేశారు ఇట్టి కార్యక్రమంలో ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి భానోత్ రాజేశ్వర్ తో పాటు అదనపు జూనియర్ సివిల్ జడ్జి దామెర్ల ప్రీతి, లీగల్ ఏ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్, శ్రీపతి భావన, ఎల్ ఎం డి కాలనీ పోలీస్ స్టేషన్ సిఐ రమేష్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత మరియు బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

## రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేసి రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించిందని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆమె పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రజాపాలనలో రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలనే సంకల్పంతో రైతు భరోసా నిధులను విడుదల చేయడం రైతాంగానికి ఎంతో ఊరటనిచ్చే నిర్ణయమని తెలిపారు. రైతులు వ్యవసాయ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాలు వ్యవసాయ రంగానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తున్నాయని, రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిద్రుప్ప రఘుగౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కంది మండల అధ్యక్షుడు మొగులయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, కౌన్సిలర్ వంశీతో పాటు అడ్డు, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

**విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయం**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల నిధులతో వైఐఐఆర్ఎస్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రభుత్వ విప్, శంకుస్థాపన**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో** సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) నిర్మాణానికి శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిలుగా హాజరై శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వేములవాడ నియోజకవర్గనికి ఒక మణిహారంగా నిలుస్తుందని తెలిపారు. త్వరలోనే చందుర్తి –మోత్కూరావు పేట రోడ్డుకు భూమి పూజ చేసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా విధానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమూల మార్పులు చేస్తున్నారని వివరించారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచారని గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందజేస్తున్నామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లో 2600 మంది విద్యార్థులు చదువుతారని, భవన నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేస్తారని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమి ఇచ్చిన వారి సహకారం మరువలేనిదని కొనియాడారు.

ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రుద్రంగిలో 10 ఎకరాల్లో రూ.46 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. ఆరు కోర్సులు.. 200 పైగా విద్యార్థులు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. మండేపల్లిలో ఇప్పటికే కొనసాగుతుందని వివరించారు. హైదారాబాద్, డిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఇటీవల ఆరుట్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో వసతులు, విద్యా బోధనపై తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. త్వరలో వేములవాడ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలకు సాగు నీరు అందించే ప్రాజెక్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మధ్య మానేరు ముంపు గ్రామాల ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి అండగా ఉంటారని పేర్కొన్నారు. జిల్లా గత యాసంగి సీజన్ కంటే ఈ ఏడాది దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ఎక్కువ చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మర్రిపల్లిలో 40 ఎకరాల స్థలంలో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయనున్నామని, దీంతో రైతులకు భూసార పరీక్షలు చేసేందుకు ఉపయోగపడుతుందని, విత్తనాలు ఇతర సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందరెడ్డి, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఎస్ఈ రవీందర్, ఈఈ అశోక్ కుమార్, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసిల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్, సర్పంచ్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.





# భారతదేశం లోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి కుమారుడి ని అభినందించిన శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు

**కరీంనగర్ అక్షిత బ్యూరో** చక్కటి విద్యను అభ్యసించడం ద్వారా పుష్కలమైన అవకాశాలు ఉంటాయని మరియు సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి నివాసంలో వారి కుమారుడు భారతదేశంలోని ప్రతిసాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకాగ్రత మరియు శ్రద్ధ తో విజయాలను సొంతం చేసుకోవచ్చని మరియు ఇతరులకు ఆదర్శంగా ఉండవచ్చని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు క్రమం తప్పకుండా విషయాలను నేర్చుకోవాలని మరియు వాటి మీద పట్టు సాధించాలని తద్వారా ఎన్నో అవకాశాలు వస్తాయని ప్రధానంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో విద్యనభ్యసించడానికి అవకాశాలు వస్తాయని మరియు ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవచ్చు అని వారు చెప్పారు విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు



నాణ్యమైన విద్యను అందించిన ద్వారా లక్ష్యాలను సులభంగా సాధించగలుగుతున్నారని వారు అభిప్రాయపడ్డారు. అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందినటువంటి వారి కుమారుడైన వి. శ్రేయస్ రెడ్డి, జాతీయస్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లను సాధించడం చాలా గొప్ప విషయమని తెలుపుతూ

ఐఐఐటి బెంగళూరు – కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్

ఐఐటి బాంబే – కెమికల్ ఇంజనీరింగ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన అన్ని పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన అతడు భవిష్యత్తులోనూ అదే విజయం పరంపరను బిట్స్ పిలానీలో సైతం కొనసాగించి అగ్రగామిగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు నరహరి, డాక్టర్ కెప్టెన్ మధుసూదన్ రెడ్డి , కన్న కృష్ణ డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి , తుమ్మల రమేష్ రెడ్డి కొమరవెల్లి వెంకటేశం

పిల్లలు ఉద్యోగ భవిష్యత్తుపై అహర్నిశలు కృషి చేస్తు చక్కటి ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులైన నరేందర్ రెడ్డి ని మరియు వనజా నరేందర్ రెడ్డి నిహృదయపూర్వకంగా అభినందించి సత్కరించారు. భవిష్యత్తులోనూ వారి పిల్లలు అద్భుతమైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

## రైతు భరోసాతో జిల్లా రైతుల జీవితాలలో

# వెలుగులు

### 175.23 కోట్ల రూపాయలతో 1 లక్ష 19 వేల 979 మంది రైతు కుటుంబాలకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం







**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం. అలాంటి రైతు కుటుంబాలకు ప్రతి పంట సీజన్‌లో ఆర్థిక ధైర్యాన్ని అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మరోసారి విజయవంతమైంది. వానాకాలం--2026 సీజన్‌లో జిల్లాలోని 1,19,979 మంది రైతుల ఖాతాల్లో 175.23 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం నేరుగా జమ కావడంతో రైతు కుటుంబాలలో ఆనందం వెల్లివిరిసింది.ఒకప్పుడు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం నేరుగా పెట్టుబడి సహాయాన్ని అందించడం వల్ల వ్యవసాయ పనులు ఆలస్యం కాకుండా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లో రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు. ఈ పథకం ద్వారా అందుతున్న సహాయంతో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సకాలంలో సాగు పనులు చేపడుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలలో నిధులు జమ కావడం వల్ల రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతోంది.

జిల్లాలోని గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసాను కల్పిస్తోంది. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గి, రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. రైతు భరోసా ద్వారా అందుతున్న నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తూ స్థానిక వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి.రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని రైతు భరోసా మరోసారి నిరూపించింది. రైతు శ్రమకు విలువనిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 67.44 లక్షల మంది రైతులకు 7,135.77 కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల కాగా, అందులో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కూడా విశేషంగా లబ్ధి పొందింది. ఈ సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడమే కాకుండా, వానాకాలం సాగును విజయవంతంగా ప్రారంభించేందుకు కీలకంగా మారింది.

రైతు భరోసా పథకంపై జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయూత అందిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు రైతు భరోసా పథకం నిలువెత్తు నిదర్శనమని, "రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది – గ్రామం బాగుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతుల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులే ఈ పథకం విజయానికి అసలైన నిదర్శనమని తెలిపారు.

## యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి




**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి** నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధిని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో భూపాలపల్లి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ కోర్సు ముగింపు, సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం సింగరేణి జిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు , కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఈ డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పొందాలంటే 50 వేల వరకు ఖర్చవుతుందని, అలాంటి ఖరీదైన కోర్సును మన భూపాలపల్లి ప్రాంత నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉచితంగా అందించడం గర్వకారణమన్నారు. సింగరేణి , టాస్క్ ద్వారా ప్రభుత్వం తరపున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించి, మొదటి విడతగా 24 మంది నిరుద్యోగ యువతకు డ్రోన్ టెక్నాలజీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి చెడు మార్గాల వైపు మళ్లకుండా, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా శిక్షణ పొంది సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా సుమారు 10 వేల మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 2,700 మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని అన్నారు. త్వరలోనే మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో మరోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని వెల్లడించారు.ప్రస్తుత ఆధునిక వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం ఎంతో పెరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , నాబార్డ్ ద్వారా సబ్సిడీపై రైతులకు, ఐకేపీ, డ్వాక్రా మహిళా సంఘాలకు ఈ డ్రోన్‌లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సబ్సిడీ డ్రోన్ల ఎంపికలో ప్రాధాన్యత ఇస్తూ, వారు రైతులకు మందుల పిచికారీ వంటి పనుల్లో సహాయపడుతూ ఉపాధి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ కేంద్రాల్లో లభించే 38 రకాల విభిన్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు కేవలం రెండు కోర్సులకు మాత్రమే ఆసక్తి చూపుతున్నారని, మిగిలిన కోర్సులపై విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని కోరారు.అనంతరం యువతకు శిక్షణ సర్టిఫికెట్లు అందచేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య , వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీనివాస్, జిల్లా, నాబార్డు అధికారులు, సింగరేణి అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు..

## రాయుడుపాలెంలో ఆలయాల కమిటీలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మట్టా

### చైర్మన్‌లు మరియు ఆలయాల నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** వేంసూరు మండలం రాయుడు పాలెం గ్రామం లో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ గా వడ్లమూడి నరసింహ రావు, 5 గురు కమిటీ సభ్యులు మరియు రాయుడు పాలెం గ్రామంలో బెండాలపాడు వీరన్న వీరభద్రుడు గుడి చైర్మన్ గా కాకాని శ్రీనివాస్ రావు మరియు 5 కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ సోమిరెడ్డి, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాయుడు పాలెం సర్పంచ్, నాయకులు మేడా వెంకటేశ్వర రావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, భక్తులు ప్రజలు, మహిళా నేతలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయం

### వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల పరిరక్షణ కోసం దొడ్డి కొమరయ్య సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, రైతుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. దొడ్డి కొమరయ్య ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని, ఆయన చూపిన సేవా మార్గాన్ని అనుసరిస్తూ ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దోహదపడిన ఉద్యమాలకు సాయుధ రైతాంగ పోరాటం బలమైన పునాదిగా నిలిచిందని, ఆ ఉద్యమంలో దొడ్డి కొమరయ్య చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మరువరాదని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను సాకారం చేస్తూ ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిద్రుప్ప రఘుగౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, రాంరెడ్డి, కౌన్సిలర్లు రమేష్, శైలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

### షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశం




**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.. సదరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లాధికారులతో ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని సమావేశానికి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ప్రాధాన్యతను తెలిపి, ముందస్తుగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ సమావేశానికి రాని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరు అయిన సదరు అధికారులకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, సమీక్షా సమావేశాల పట్ల అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు..

## మునిపంపుల జెడ్పీహెచ్ఎస్‌లో జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ రద్దు చేసి పాఠశాలలోనే కొనసాగించాలి

### మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

### జెడ్పీ డిప్యూటీ సీఈఓకు వినతిపత్రం



**రామన్నపేట అక్షిత ప్రతినిధి** మునిపంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై ఇతర చోటుకు పంపిన నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి, విద్యార్థులు మరియు పాఠశాల పరిపాలనా అవసరాల దృష్ట్యా అదే పాఠశాలలో కొనసాగించాలని కోరుతూ మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.


ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశం మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ కారణంగా పాఠశాల పరిపాలనా పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాల సజావుగా నిర్వహణ కొనసాగాలంటే సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను మునిపంపుల జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే కొనసాగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్,సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, నాయకులు గంటెపాక శివకుమార్, మేడి ముకుంద, పుట్టల ఉదయ్ కుమార్,అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో మార్పులతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** నోయిడాలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ుజుణఇ అంతర్జాతీయ వేదికపై మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని, విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పుల అవసరాన్ని బలంగా ప్రతిపాదించారు. సమాజం నిజమైన అభివృద్ధి దిశగా పయనించాలంటే విద్యలో నాణ్యత, సమాన అవకాశాలు, ఆధునిక సాంకేతికత అనుసంధానం అత్యవసరమని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు అయినప్పుడే సమాజ వికాసం సాధ్యమవుతుందని, విద్య అనేది వ్యక్తిగత ఎదుగుదలకే కాకుండా దేశ అభివృద్ధికి కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. ుజుణఇ వంటి అంతర్జాతీయ వేదికపై మాట్లాడే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా రంగంలో తీసుకువస్తున్న వినూత్న మార్పులను ప్రపంచానికి పరిచయం చేశారు.



మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో తన నియోజకవర్గంలో అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను ఆయన వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు, డిజిటల్ లెర్నింగ్ విస్తరణ, డిజిటల్ లైబ్రరీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించడం వంటి అంశాలను విశదీకరించారు. "మై విలేజ్ స్కూల్" కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాలకు ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ, గ్రామీణ విద్యను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతోందని అన్నారు. అదేవిధంగా ఌ= కోడ్ డిజిటల్ లెర్నింగ్ విధానం ద్వారా విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునే విధంగా పాఠ్యసామగ్రిని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యను ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగడం ద్వారా సామాజిక అసమానతలను తగ్గించవచ్చని, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారిని గ్లోబల్ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. సాధారణంగా మేధావులు, పరిశోధకులు, అవార్డు గ్రహీతలు మాత్రమే పాల్గొనే ుజుణఇ వేదికపై ఒక ప్రజాప్రతినిధికి అవకాశం లభించడం అరుదైన విషయం. ఈ నేపథ్యంలో లియెన్నం శ్రీనివాస్ రెడ్డికిలి ఈ అవకాశం రావడం మహబూబ్ నగర్ ప్రాంతానికి గర్వకారణమని పలువురు మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆయన ప్రసంగాన్ని అభినందిస్తూ, విద్యా సంస్కరణలపై ఆయన చూపిస్తున్న దృఢ సంకల్పం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఆయన చేపడుతున్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## కేంద్ర మంత్రి బండి ఎమ్మెల్యే కవ్వంపల్లి పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ శ్యామ్'

### ఎల్ ఎం డి పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ




**మానకొండూర్ అక్షిత న్యూస్**కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పగిడిపల్లి శ్యామ్ తెలంగాణ శ్యామ్ పై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు శనివారం గునుకుల కొండపూర్ సర్పంచ్, బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ , నాయకులు బొంతల కళ్యాణ్ చంద్ర, గాజె రమేష్, చింతం శ్రీనివాస్ , సుగుర్తి జగదీశ్వర చారి, ,గడ్డం అరుణ్ , బూట్ల శ్రీనివాస్ లతో కలిసి లిఖితపూర్వకంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల్లోకి వెళితే గత జూన్ 20న కొత్తపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల సందర్భంగా రెండు వర్గాల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ వివాదానికి ఎటువంటి సంబంధం లేని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై పగిడిపల్లి శ్యామ్ అలియాస్ తెలంగాణ శ్యామ్ బాధ్యతారహితంగా, రెచ్చగొట్టేలా మాట్లాడారని అజయ్ వర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూలై 2వ తేదీన ఒక యూట్యూబ్ న్యూస్ ఛానల్ ,జి. 8, లో తెలంగాణ శ్యామ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి , ఎమ్మెల్యే "గ్రామానికి వస్తే చెప్పులతో కొట్టండి" అంటూ ప్రజలను రెచ్చగొట్టేలా , ప్రేరేపించేలా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రకమైన వ్యాఖ్యలు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను, ప్రజా ప్రతినిధులను అవమానించేలా ఉన్నాయని ఫిర్యాదు దారుడు సొల్లు అజయ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను సిడి పోలీసులకు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి, తక్షణం తెలంగాణ శ్యామ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అజయ్ వర్మ కోరారు.

## ఆర్మూర్‌లో ఉపఎన్నికలకు సిద్ధం....!

### ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌తో రాజీనామా చేయించి బరిలోకి దించండి...!

### బీజేపీ నేతల సవాల్




**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్ మున్సిపల్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌తో రాజీనామా చేయించి ఆర్మూర్‌లో ఉపఎన్నిక నిర్వహించాలని, దమ్ముంటే ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిపై ప్రత్యక్ష పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. అలాగే ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరిస్తూ, ముఖ్యంగా "గంధపు చెక్కల స్మగ్లర్" వంటి ఆరోపణలు బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకుని రాజకీయ అంశాలపైనే మాట్లాడాలని సూచించారు.

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎమ్మెల్యే ని విమర్శించే స్థాయి ప్రత్యర్థులకు లేదని బీజేపీ నేతలు పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేస్తే తగిన విధంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షుడు మందుల బాలు, యామాద్రి భాస్కర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, పోల్కం వేణు, జెస్సు అనిల్, కౌన్సిలర్ బొట్టు రాజు, పులి యుగంధర్, కౌన్సిలర్ శ్రావణ్, ఉదయగౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.